భోగ భాగ్యాల భోగిళ్లో...

- గ్రామాల్లో సంక్రాంతి సంబరాలకు ఘన స్వాగతం
- మిన్నంటిన భోగిమంటలు

కాజులూరు: భోగిళ్లో.. భోగిళ్లో.. భోగ భాగ్యాల భోగిళ్లో అంటూ వాడవాడలా సంక్రాంతి సంబరాలు ఘనంగా మొదలయ్యాయి. ఎప్పుడెప్పుడు పండుగ ఏడాది పండగ అంటూ సంక్రాంతి కోసం ఎదురుచూసిన కుర్రకారు శనివారం అర్ధరాత్రి దాటగానే నెల రోజులుగా సేకరించిన పుల్లా, పిడక ఇతర కలపతో వీధుల్లో భోగి మంటలు వేశారు. సంక్రాంతి సంబరాలకు స్వాగతం పలికారు. సంక్రాంతి పండగల్లో 'భోగి' పండగ తొలిఘట్టం. చిమ్మచీకట్లను చీల్చుకుంటూ వెలుగులు నింపే భోగిమంటలు పాతకు స్వస్తి పలికి కొత్తదనానికి నాంది పలుకుతుందని గ్రామీణ ప్రజల విశ్వాసం. భోగి రోజున ఆవు పేడతో తయారు చేసిన భోగి పిడకలను చిన్నారులు దండలుగా గుచ్చి భోగిమంటల్లో వేస్తారు. మంటల్లో నీళ్లు కాచుకుని తెల్లవారక ముందే తలారా స్నానం చేసి కొత్త దుస్తులు ధరిస్తారు. చుట్టుపక్కల వారిని పిలిచి తమ ఇంట చిన్నారులకు డబ్బులు, రేగిపళ్లు, పువ్వులు, అక్షతలు కలిపి భోగిపళ్లు పోసే కార్యక్రమం గ్రామాల్లో ఇంటింటా వేడుకగా జరుగుతుంది. మరుసటి రోజే సంక్రాంతి. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించడంతో మకర సంక్రాంతి పండగను జరుపుకొంటారు. పితృదేవతలకు తర్పణాలు ఇవ్వడంతో పాటు వారి పేరు మీద దుస్తులు, బియ్యం పంపిణీ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. మూడో రోజు జరుపుకొనే కనుమ పండగ నాడు గ్రామ దేవతలను పూజించి వారికి నేవైద్యాలు సమర్పిస్తారు. చివరి పండుగైన ముక్కనుమ రోజున పాడిని అందించే పశువులకు పూజలు చేస్తారు. సంక్రాంతి లక్ష్మికి వీడ్కోలు పలికేందుకు ప్రతి ఇంటి వద్ద రథం ముగ్గులు వేస్తారు. ధనుర్మాసం ప్రారంభమైన నాటి నుంచి పొలాల్లోకి వెళ్లి తెచ్చిన తాటి దుంగలు, ఇతర కలపతో శనివారం అర్ధరాత్రి సమయంలో భోగి మంట వేశారు.


మొగలిపాలెంలో భోగి మంట కోసం చెట్టుదుంగను తరలిస్తున్న చిన్నారులు


సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంట వేసిన దృశ్యం


గొల్లపాలెం ముగ్గులపోటీ విజేతకు బహుమతులు అందిస్తున్న అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు

పండగలు తెలుగు సంప్రదాయాలకు ప్రతీకలు

కాజులూరు: పండగలు తెలుగు సంప్రదాయాలకు ప్రతీకలని గొల్లపాలెం సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక అన్నారు. స్థానిక అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం గ్రామంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు తెలుగు సంస్కృతి, గ్రామీణ పండగలు, సంప్రదాయాలను వివరిస్తూ వినూత్నరీతిలో ప్రదర్శనలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వాతావరణం ఉట్టిపడేలా గొబ్బెమ్మలు పెట్టి, భోగి మంటలు వేసి దాని చుట్టూ జానపద గేయాలు పాడుతూ నృత్యాలు చేశారు. పలువురు మహిళలు, చిన్నారులు పోటాపోటీగా ముగ్గులు పెట్టి చూపరులను ఆకర్షించారు. పోటీల్లో విజేతలకు క్లబ్ సభ్యులు బహుమతులు అందజేశారు. అలయన్స్ క్లబ్ అధ్యక్షురాలు టి.భువనేశ్వరి, స్థానిక నాయకులు టేకుమూడి దుర్గారావు, నిమ్మితి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

కె.గంగవరం: మండలంలోని సత్యవాడలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ముగ్గుల పోటీలలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని సంక్రాంతి ముగ్గులు వేశారు. దీంతో పాటు సంప్రదాయ దస్తువులు ధరించి గొబ్బెమ్మలు పెట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జనసేన నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నాయకులు రాయపురెడ్డి రాజా మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను నేటి తరం యువతకు తెలియజేయడానికి సంక్రాంతి సంబరాలు ఉపయోగపడతాయని సూచించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఎంపీటీసీ సలాది ఎర్రిబాబు, సలాది శ్రీను, దేవరపల్లి చక్రి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువులకు గాలికుంటు నివారణ వ్యాక్సిన్లు


వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సునీత తదితరులు

కె.గంగవరం: గ్రామాల్లో ఉన్న ప్రతి పాడి రైతు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ పశువులకు వ్యాక్సినేషన్ వేయించుకోవాలని వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల, సర్పంచ్ చీకట్ల సునీత కోరారు. మండలంలోని పాణింగపల్లిలో శనివారం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు వ్యాక్సినేషన్ జరుగుతుందన్నారు. ప్రతి పాడిపశువుకు టీకాలు వేసేందుకు డోసులు అందుబాటులో ఉన్నాయని పశువైద్య సిబ్బంది గ్రామాలకు వచ్చి ఉచితంగా వ్యాక్సినేషన్ వేస్తారని పేర్కొన్నారు. అనంతరం పశువైద్య శిబిరంలో పేకేరు పశువైద్యశాల వైద్యులు సురేష్‌బాబు పశువులకు ఉచితంగా గర్భకోశ వ్యాధులకు పరీక్షలు చేశారు. పశువైద్యులు బిందు, సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుతరామయ్య, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి

కాజులూరు: రైతును రాజు చేయాలన్న దివంగత సీఎం వైఎస్సార్ ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి జగనన్న అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. శనివారం తణుకువాడలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయసాధనలో భాగంగా సీఎం జగనన్న రైతుల కోసం ప్రతి గ్రామంలో ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతులకు అనేక సూచనలు, సలహాలు అందించేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో వ్యవసాయ సలహా మండళ్లను నియమించారన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందించేందుకు, వ్యవసాయ రంగానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు, రైతు ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ఈ కమిటీ దోహదపడుతుందన్నారు. దాళ్వా సాగులో ఎరువుల కొరత రాకుండా ఆర్బీకేలు ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు దెయ్యాల వెంకటరమణ, వాసంశెట్టి శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ తాడి భువనేశ్వరిదేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల అందజేత


నేలటూరులో పంచాయతీ కార్మికులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్, కార్యదర్శి

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరులో పంచాయతీ కార్మికులకు పంచాయతీ నిధులు నుంచి దుస్తులను అందజేశారు. సంక్రాంతి నేపథ్యంలో సర్పంచ్ కుక్కల వీరన్న, కార్యదర్శి రామకృష్ణ చేతుల మీదుగా కార్మికులకు దుస్తులను అందజేశారు.

101 మందికి ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ


కపిలేశ్వరపురంలో లబ్ధిదారుకు కళ్లజోడును అందజేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పీహెచ్‌సీ పరిధిలోని నాలుగు గ్రామాల్లో 101 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 101 మందికి కళ్ళజోళ్లను అందజేస్తున్నారు. ఆయా గ్రామాల్లో శనివారం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలోని సిబ్బంది కళ్లజోళ్లను ఇళ్లకు తీసుకెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. అంగర 1 సచివాలయంలో 11, అంగర-2లో 19, తాతపూడిలో 18, కపిలేశ్వరపురం-1లో 11, కపిలేశ్వరపురం-2లో 7, పడమర ఖండ్రికలో 35 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునరావు, హెచ్ఈ బి.రామారావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రావులపాలెం సీఐగా ఆంజనేయులు

రావులపాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో ఎస్సై స్థానంలో సీఐ ర్యాంక్ అధికారి బాధ్యతలు నిర్వహించేలా మారింది. దీంతో నూతన సీఐగా తణుకు రూరల్ సీఐగా ఉన్న సీహెచ్ ఆంజనేయులు బదిలీపై రావులపాలెం వచ్చారు. శనివారం ఆయన స్థానిక స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. అప్‌గ్రేడ్ స్టేషన్‌కు మొట్టమొదటి సీఐగా బాధ్యతలు స్వీకరించడంతో ఆయనకు ఇతర పోలీస్‌సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


ముగ్గుల పోటీల విజేతలకు అభినందిస్తున్న సతీష్ తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరం ఎఫ్‌ఎంసీ మందుల కంపెనీ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ముగ్గులు వేసి వారి ప్రతిభను చాటుకున్నారు. కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ మంగాదేవి, ఎంపీటీసీ సభ్యుడు రెడ్డం సతీష్‌లు మాట్లాడుతూ మహిళలు ఉత్సాహంగా పాల్గొనటం అభినందనీయమన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

నూతన వస్త్రాల పంపిణీ


సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేస్తున్న ఈఓ తారకేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: అన్నయ్యపేట గ్రామపంచాయతీ వద్ద పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, వైస్ ఎంపీపీ శాఖ బాబి, గ్రామ పెద్దలు రావు సుబ్బారావు, పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, కాకరపల్లి వెంకటరత్నం, స్టూడియో నాని, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివారి ఆలయం వద్ద ఈఓ పితాని తారకేశ్వరరావు సిబ్బందికి నూతన వస్త్రాలను అందజేశారు. సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

స్వామి జన్మ నక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేశారు. ఆలయ అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించింది. భక్తుల సమక్షంలో పంచామృతాభిషేకం చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఊరంతా ఉల్లాసం.. మనసంతా ఆత్మీయం

- సంక్రాంతి శోభతో పులకిస్తున్న పల్లెలు
- సొంతూళ్లకు చేరుకుంటున్న బంధువులు
- భోగి మంటలకు జోరుగా ఏర్పాట్లు

రాయవరం: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి రానే వచ్చింది. పల్లెల్లో ఎక్కడ చూసినా సంక్రాంతి శోభ కన్పిస్తోంది. ఉద్యోగ, వ్యాపార, కూలి పనుల నిమిత్తం ఎక్కడెక్కడో ఉంటున్న వారు తమ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని మహిళలు వేస్తున్న రంగురంగుల ముగ్గులతో ఇళ్ల ముంగిళ్లు ముచ్చట గొలుపుతున్నాయి. సంక్రాంతి పర్వదినాన్ని ప్రతిబింబించే గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల సంకీర్తనలతో గ్రామాల్లో ఆనందకర వాతావరణం నెలకొంది. భోగిమంటలు వేసేందుకు యువత జోరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం భోగి, 15న పెద్ద పండగ, 16న మకర సంక్రాంతి, 17న ముక్కనుమ పండుగలను నిర్వహించుకునేందుకు ప్రజలు సన్నద్ధం అవుతున్నారు.

మారుతున్న పోకడ

గతంలో పిల్లలు, పెద్దలు పొలాల్లోని ఎండిపోయిన చెట్లను నరికి భోగి మంటలకు దుంగలుగా తీసుకుని వచ్చేవారు. దీనికి తోడు భోగి మంగలు వేయడానికి పిడకలు కావాల్సి ఉంటుంది. దాంతో పిడకలను ఇళ్ల వద్దకు వెళ్లి ఆట పాటలతో దండుకునేవారు. అయితే అలాంటి సరదా నేడు కనుమరుగైపోయింది. భోగి మంటలకు కావాల్సిన పుల్లలను నేడు కొనుగోలు చేసి మంటలు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

సంక్రాంతికి ప్రతీక హరిదాసు, గంగిరెద్దు

సంక్రాంతి పండగ వచ్చిందంటే ప్రతి ఇంటి ముందూ హరిదాసు, గంగిరెద్దుల వారు దర్శనం ఇస్తారు. హరిదాసు సంక్రాంతి కీర్తనలతో అలరిస్తూ పిల్లలు, పెద్దలు వేసిన బియ్యం, పిండి వంటలు తీసుకుని సంతృప్తి పడతారు. గంగిరెద్దుతో ఆటలు ఆడించేవారు గంగిరెద్దను ఇంటికి తీసుకుని వచ్చి అమ్మవారికి దండం పెట్టు..అయ్యవారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దుతో విన్యాసాలు చేయిస్తారు. పిల్లా పాపలు ఆనందంగా ఉండాలంటూ దీవెనలు అందిస్తారు. చనిపోయిన వారికి ఆత్మలకు శాంతి కలుగుతుందనే నమ్మకంతో వారి పేరిట దానధర్మాలు చేయడం జరుగుతుంటుంది.


భోగిమంట

సాధికార యాత్రను జయప్రదం చేయండి


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాల వారికి జరిగిన అభివృద్ధిని వివరించేందుకు ఈనెల 21న జరిగే సామాజిక సాధికార యాత్ర సభను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రసన్న విఘ్నేశ్వర ఫంక్షన్ హాల్‌లో శనివారం రామచంద్రపురం అర్బన్, రూరల్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ హాజరయ్యారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ గతంలో సుదీర్ఘమైన తన పాదయాత్ర ద్వారా ప్రజల కష్టాలను దగ్గరుండి గమనించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల సంక్షేమమే ధ్యేయంగా నవరత్న పథకాలను అమలు చేశారన్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసి దేశంలో రికార్డు సృష్టించారన్నారు. ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రతీ ఇంటికి వెళ్లి వివరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన ఘనత సీఎం జగన్‌దేనని సూర్యప్రకాశ్ అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి తిరిగి మళ్లీ జగన్ ముఖ్యమంత్రిగా ఉండాల్సిన అవసరాన్ని ప్రజలకు ప్రతి కార్యకర్త వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకూ తాను అండగా ఉంటానని ఏ కష్టం వచ్చినా తన వద్దకు వస్తే తప్పకుండా తాను స్పందిస్తానని సూర్యప్రకాశ్ కార్యకర్తలకు తెలిపారు. పార్టీ అధినేత, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తనకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని, ఆయన ఆదేశానుసారం నడుచుకుంటూ నియోజకవర్గంలో కార్యకర్తల మనసును గెలుచుకుంటానన్నారు. తొలుత మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, ఎంపీపీ అంబటి భవాని, మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు వై.సతీష్‌కుమారి, పెమ్మిరెడ్డి దొరబాబు, పార్టీ నేతలు దొంగల శ్రీధర్, పెమ్మిరెడ్డి మురళి, మాగాపు అమ్మిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, పార్టీ నాయకుడు వల్లు శివ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

కె.గంగవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని కె.గంగవరంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకే, గ్రామ సచివాలయాల్లో శనివారం ఆయన కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ప్రభుత్వ భవనాలన్నీ ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటుందని రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ని మళ్లీ సీఎంను చేయాలని కోరారు. సీఎం జగన్ పాలనలో సంస్కరణలు తీసుకువచ్చారని పేదలను ఆదుకోవడంతో పాటు అభివృద్ధి పనులు కూడా చేశారన్నారు. ప్రతిపక్ష పార్టీలు కేవలం తమ ఉనికిని కాపాడుకునేందుకు లేనిపోని స్టేట్‌మెంట్లు ఇస్తున్నారని చెప్పారు. ప్రజలు గమనించి రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలను బంగాళాఖాతంలో కలపాలని కోరారు. రాష్ట్ర నాయకులు వట్టికూటి రాజశేఖర్, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, చిట్టూరి చిన్ని, వల్లభరెడ్డి చిన్ని, తోకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కె.గంగవరంలో నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

సొంతూరికి వస్తూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం

ఉంగుటూరు: స్వగ్రామంలో సంక్రాంతి పండుగ చేసుకోవడానికి వస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన శనివారం తేలప్రోలులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన సత్తి నాగసాయి శ్రీరామరెడ్డి, రాయవరం గ్రామానికి చెందిన బొప్పన చాందిని (24) ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు. నాగసాయి శ్రీరామిరెడ్డి హైదరాబాద్‌లో యూఎస్‌టీ కంపెనీలో, చాందిని టీసీఎస్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. సంక్రాంతి పండగ పురస్కరించుకుని తమ స్వగ్రామాలకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి వచ్చేసరికి ఉదయం వేళ మంచు ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తూ ఆగి ఉన్న కంటైనర్‌ని ఢీకొన్నారు. ఘటనలో వెనుక కూర్చున్న చాందిని కింద పడటంతో తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఆత్కూరు ఎస్ఐ టి.సూర్యశ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయ ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను అలంకరించిన తీరు విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగా, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి ఇచ్చారు. వేదపండితులు స్వామికి తులసి పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


చదువు నేర్పిన గురువులను పాఠశాల ఆవరణలో సన్మానించిన పూర్వ విద్యార్థులు

కె.గంగవరం: మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో కలుసుకుని రోజంతా ఉల్లాసంగా గడిపారు. పాఠశాలకు చెందిన 1995-96 బ్యాచ్ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలదండలు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. అనంతరం రూ.85 వేలతో పాఠశాలలో ఫర్నీచర్‌ను కొనుగోలు చేసి ఉపాధ్యాయులకు అందించారు. దీంతో పాటు స్నేహితురాలైన సుజాత తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆర్థిక సాయంగా రూ.50 వేలను ఫిక్సిడ్ డిపాజిట్ చేసి పత్రాలను అందించారు. సుమారు 28 సంవత్సరాల తరువాత వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న స్నేహితులందరూ ఒకేచోట కలుసుకుని సాదకబాధకాలు చెప్పకుంటూ రోజంతా సంతోషంగా గడిపారు. హనుమంతురావు, చౌదరి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పసలపూడిలో అ'పూర్వ' సమ్మేళనం


పూర్వ విద్యార్థుల గ్రూపు ఫొటో

రాయవరం: మండలంలోని పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1988-89లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల చెట్టునీడలో కలుసుకున్నారు. 35 ఏళ్ల అనంతరం కలుసుకున్న విద్యార్థులు గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సత్తి త్రినాథరెడ్డి, పాక్కులూరి శ్రీరామచంద్రమూర్తి, నేమాని సుబ్రహ్మణ్యేశ్వర శర్మ వాడ్రేవు రమణి, తటవర్తి సుబ్రహ్మణ్యంలను ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా మరోమారు గ్రూపు ఫొటో దిగారు. కార్యక్రమానికి ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులుగా సత్తి వీర్రాఘవరెడ్డి, పోతంశెట్టి చింతారెడ్డి, పులగం సత్యనారాయణరెడ్డి, కర్రి శ్రీదేవి, కొవ్వూరి సుధాకరరెడ్డి వ్యవహరించారు.


గోపాలకృష్ణయ్య కుంచె నుంచి జాలువారిని చిత్రం (అంతరచిత్రం) రామవరపు గోపాలకృష్ణయ్య

సం'క్రాంతి' చిత్రరూపం

రాయవరం: తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు సంక్రాంతి. మూడు రోజులు వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ సందేశం, స్ఫూర్తితో జరుపుకునే పండగలు. వేగంగా జీవన ప్రమాణాలు, కాలాలు మారుతున్నా..సంక్రాంతుల శోభ మాత్రం నేటి తరానికి పాత తరం పదిలంగా అందిస్తోంది. సంస్కృతి, సంప్రదాయాలను స్వాగతిస్తూ..సంక్రాంతి పండుగకు దర్పణంలా నిలిచేలా రాయవరం గ్రామానికి చెందిన చిత్రకారుడు రామవరపు గోపాలకృష్ణయ్య కుంచె నుంచి జాలువారిని చిత్రమిది. ఇంటి ముందు రంగవల్లులు, గొబ్బెమ్మలు పెడుతున్న గృహలక్ష్మి, హరిదాసు, గంగిరెద్దు లాడించేవారు, ఎడ్లబండిపై ఇంటికి వస్తున్న ధాన్యలక్ష్మి, పండగకు వస్తోన్న కొత్త జంట, కోడి పందేలు ..ఇలా సంక్రాంతి పండగను గోపాలకృష్ణయ్య తీర్చిదిద్దిన దృశ్యమాలిక పలువురిని ఆకట్టుకుంది.